ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 2 | సంచిక: 249 | పేజీలు: 4 | వెల: రూ.3/- | ఆదివారం 15 డిసెంబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్


# దేశానికే ఆదర్శంగా కులగణన

## 98 శాతం కులగణన పూర్తి

- ప్రభుత్వం ఇస్తున్న గ్యారెంటీలు పేదలకే అందుతున్నాయ్
- అమ్మలా ఉండే తెలంగాణ తల్లినే తెచ్చుకున్నాం
- రైతాంగ పోరాటంలో తెగువ చూపిన దొడ్డి కొమురయ్య
- కురుమ భవన ప్రారంభ కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి
- ఎస్సీ వర్గీకరణ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది
- ఎట్టిపరిస్థితుల్లో ఎస్సీ కులాలకు అన్యాయం చేయను
- అందరికీ న్యాయం చేసే బాధ్యత నాదే
- గ్లోబల్ మాదిగ డే కార్యక్రమంలో సిఎం



**హైదరాబాద్, డిసెంబర్ 14 (ప్రభాత ఉదయం):** కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న గ్యారెంటీలు పేదలకే అందుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అమ్మలా ఉండే తెలంగాణ తల్లినే తెచ్చుకున్నామని అన్నారు.. ఆ విగ్రహం మన అమ్మకు, అక్కకు ప్రతిరూపమని పేర్కొన్నారు. దేశానికే ఆదర్శంగా కులగణన చేపడుతున్నామని వివరించారు. 98 శాతం కులగణన జరిగిందని వెల్లడించారు. హైదరాబాద్‌లోని కోకాపేట్‌లో కురుమ భవన ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కురుమల నిజాయితీని, గొప్పతనాన్ని ముఖ్యమంత్రి కొనియాడారు. కురుమలు అత్యంత నమ్మకస్తులని తాను ఎప్పుడూ చెబుతూ ఉంటానని, ఊళ్లో భూమి అమ్ముకోవాలంటే ముందు కురుమలకు అమ్ముకోవాలని చెబుతుంటానని తెలిపారు. పార్లమెంటులో కూడ కురుమ సోదరుల ప్రాతినిధ్యం పెంచుతామని చెప్పారు."కురుములకు భూమి అమ్మితే డబ్బు నడుముకు కట్టుకుని తెచ్చి ఇస్తారు.. వారు ఇచ్చిన డబ్బును లెక్కపెట్టుకోవాల్సిన అవసరం లేదు. దొడ్డి కొమురయ్య ఆనాడు రైతాంగ పోరాటంలో తెగువ చూపారు. దొడ్డి కొమురయ్య రైతాంగ పోరాటాన్ని ముందుండి నడిపారు. కురుమలు

..మిగతా 2లో

## చిత్తశుద్ధితో గురుకులాల ప్రక్షాళన

- గురుకులాల ప్రక్షాళన కోసం ప్రభుత్వం సిద్ధం
- ప్రతి నెల 10లోపు విద్యా సంస్థలకు నిధులు
- ఇటీవలే గురుకులాల డైట్ ఛార్జీలు పెంచాం
- గురుకులాల బాటను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం
- గురుకుల పాఠశాలను సందర్శించిన సీఎం
- గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో కామన్ డైట్ ప్రారంభం

2

### కేసు విషయంలో ఎన్నో మాట్లాడాలని ఉన్నా

# కోర్టు ఆదేశాల మేరకు మాట్లాడలేకపోతున్నా

- థియేటర్‌లో అనుకోకుండా జరిగిన ఘటన
- ఘటనలో నా ప్రమేయం లేదు: అల్లు అర్జున్
- త్వరలోనే బాధిత కుటుంబాన్ని కలుస్తా
- చంచల్‌గూడ జైలు నుంచి విడుదలైన అల్లు అర్జున్
- అల్లు అర్జున్ అరెస్టును ఖండించిన సినీ ప్రముఖులు



**హైదరాబాద్, డిసెంబర్ 14 (ప్రభాత ఉదయం):** తనపై నమోదైన కేసుకు సంబంధించి అనేక విషయాలు మాట్లాడాలని ఉన్నా, కోర్టు ఆదేశాల మేరకు మాట్లాడలేకపోతున్నట్లు అల్లు అర్జున్ స్పష్టం చేశారు. సంధ్య థియేటర్ వద్ద విషాదకర సంఘటన జరగడం పట్ల మరోసారి బాధిత కుటుంబానికి క్షమాపణలు చెప్పిన ఆయన, త్వరలోనే ఆ కుటుంబాన్ని కలుస్తానని వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి తనకు మద్దతు ఇస్తున్న వారందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇవాళ ఉదయం చంచల్‌గూడ జైలు నుంచి విడుదలైన అల్లు అర్జున్, జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. తనపై చూపించిన ప్రేమ, అభిమానానికి అభిమానులకు, దేశవ్యాప్తంగా మద్దతిచ్చిన మీడియాకు కృతజ్ఞతలు చెబుతున్నానంటూ అల్లు అర్జున్ పేర్కొన్నారు. సంధ్య థియేటర్‌లో జరిగింది అనుకోని ఘటన అని, అందులో

..మిగతా 2లో

# రేపు వన్ నేషన్... వన్ ఎన్నికల బిల్లు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 14 (ప్రభాత ఉదయం):** దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణకు సంబంధించి రూపొందించిన రెండు కీలక బిల్లులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ ముసాయిదా బిల్లులు ఈనెల 16వ తేదీన లోక్‌సభ ముందుకు రానున్నట్లు తెలిసింది. ఈ మేరకు అధికారిక వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంది. డిసెంబర్ 16న 'వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లు'ను లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ 129వ రాజ్యాంగ సవరణ బిల్లు కింద జమిలి బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించాయి. ఆ తర్వాత దీనిని చర్చ కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపనున్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభకు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలను నిర్వహించడమే జమిలి ఎన్నికల ప్రధాన ఉద్దేశం. వాస్తవానికి మన దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణ కొత్తదేమీ కాదు. 1952లో తొలి సాధారణ ఎన్నికలు మొదలుకొని, 1967 వరకు లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు చాలావరకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. అయితే అనంతర కాలంలో సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడకపోవడం, గడువుకు ముందే పలు రాష్ట్రాల శాసనసభలను బర్తరఫ్ చేయడం తదితర కారణాలతో జమిలి ఎన్నికలు పట్టాలు తప్పాయి. దీంతో లోక్‌సభ, అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు జరుపడం మొదలైంది.

# డిమాండ్ల సాధన కోసం రైతుల ఉద్యమబాట

## చలో ఢిల్లీ మార్చ్‌కు పిలుపు.. అడ్డుకున్న పోలీసులు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 14 (ప్రభాత ఉదయం):** తమ డిమాండ్ల పరిష్కారానికై రైతులు మరోసారి ఉద్యమబాట పట్టారు. ఇవాళ మధ్యాహ్నం 'చలో ఢిల్లీ' మార్చ్‌ను ప్రారంభించారు. కనీస మద్దతు ధర సహా 11 డిమాండ్ల సాధన కోసం 101 మంది రైతులు ఈ మార్చ్‌లో పాల్గొన్నారు. అయితే, రైతులను శంభు సరిహద్దు వద్ద హర్యాణా పోలీసులు అడ్డుకున్నారు. రైతులపై బాష్పవాయువు, జల ఫిరంగులను ప్రయోగిం చారు. దీంతో సరిహద్దు వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇక రైతుల ఢిల్లీ చలో మార్చ్‌ను అడ్డుకోవడం ఇది మూడోసారి. డిసెంబర్ 6 నుంచి ఢిల్లీ వైపుకు వెళ్లేందుకు రైతులు ప్రయత్నించగా.. ఇప్పటికే ఆ ప్రయత్నాలను రెండుసార్లు పోలీసులు అడ్డుకున్న విషయం తెలిసిందే. దీంతో పోలీసుల తీరుపై రైతులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక రైతుల ఢిల్లీ మార్చ్ నేపథ్యంలో హర్యాణా ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందు జాగ్రత్త చర్యగా మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేసింది. శనివారం ఉదయం 6 గంటల నుంచి 17వ తేదీ అర్ధరాత్రి వరకూ సేవలు నిలిపివేస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. తాము పండించిన పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కావాలని రైతులు ప్రధానంగా కోరుతున్నారు. రుణ మాఫీ చేయాలని, రైతులు, రైతు కూలీలకు పెన్షన్ ఇవ్వాలని, విద్యుత్ చార్జీలు పెంచరాదని, రైతులపై పెట్టిన పోలీస్ కేసులు ఎత్తివేయాలని, 2021 లఖింపూర్ ఖేరి బాధితులకు న్యాయం చేయాలని, భూ సేకరణ చట్టం 2013ను పునరుద్ధరించాలని, ఆందోళనలో మరణించిన రైతుల కుటుంబాలకు నష్టపరిహారం అందజేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# నేటి నుంచి గ్రూప్-2 పరీక్షలు

## పూర్తి ఏర్పాట్లు చేసిన అధికారులు

## తెలంగాణ వ్యాప్తంగా 1,368 పరీక్షా కేంద్రాలు



**హైదరాబాద్, డిసెంబర్ 14 (ప్రభాత ఉదయం):** రాష్ట్ర వ్యాప్తంగా రేపు, ఎల్లుండి గ్రూప్-2 పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించి టీజీపీఎస్సీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తెలంగాణ వ్యాప్తంగా 1,368 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలను ఓఎంఆర్ పద్ధతిలో నిర్వహించనున్నారు. 783 పోస్టుల భర్తీకి 2022 డిసెంబర్ 29న నోటిఫికేషన్ విడుదలైంది. పలు కారణాల వల్ల గ్రూప్-2 పరీక్ష వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు ఈ నెల 15, 16 తేదీల్లో పరీక్షలను నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. పరీక్షకు హాజరయ్యే వారు హాల్ టికెట్‌తో పాటు ఇటీవల దిగిన పాస్ పోర్టు సైజు ఫొటో, ప్రభుత్వంచే జారీ చేయబడ్డ ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలని అధికారులు సూచించారు. ఇక మహిళా అభ్యర్థులకు మంగళసూత్రం, గాజుల వరకే అనుమతించనున్నారు. ఇతర ఆభరణాలు ఉంటే అనుమతించమని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ చెప్పులే ధరించాలన్నారు. బెల్ట్‌లు, రిమోట్ కీస్‌కు అనుమతి లేదని తెలిపారు.

# నేనెక్కడికీ పారిపోలేదు

## అసత్య వార్తాలపై స్పందించిన మోహన్‌బాబు



**హైదరాబాద్, డిసెంబర్ 14 (ప్రభాత ఉదయం):** మంచు మోహన్ బాబు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారంటూ వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. జర్నలిస్టుపై దాడి ఘటనకు సంబంధించి హత్యాయత్నం కేసులో స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసేందుకు పోలీసులు ప్రయత్నించగా మోహన్ బాబు కనిపించలేదని సదరు కథనాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో అజ్ఞాతం వార్తలపై మోహన్ బాబు స్పందించారు. తాను ఎక్కడికీ పారిపోలేదని.. ఇంట్లోనే వైద్య సంరక్షణలో ఉన్నట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. 'నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. నా ముందస్తు బెయిల్ తిరస్కరించినట్లు వార్తలు వస్తున్నాయి. అందులో ఎలాంటి నిజం లేదు. నేను ఎక్కడికీ పారిపోలేదు. ప్రస్తుతం ఇంట్లో వైద్య సంరక్షణలో ఉన్నాను. వాస్తవాలు తెలుసుకోకుండా తప్పుడు వార్తలు రాయొద్దని మీడియాను కోరుతున్నాను' అంటూ ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్ అవుతోంది.

# కాంగ్రెస్ నిర్లక్ష్యం గురుకుల పాలిట శాపం

## ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శించిన హరీశ్‌రావు

## వరుస ఘటనలతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో కలవరం

## కనీసం నాణ్యమైన ఆహారాన్ని కూడా అందించలేరా..: హరీశ్‌రావు



**హైదరాబాద్, డిసెంబర్ 14 (ప్రభాత ఉదయం):** విద్యార్థుల ఆరోగ్యాలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని, తద్వారా విద్యార్థులు ప్రాణాలు సంకటంగా మారాయని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం.. గురుకుల విద్యార్థులకు శాపంగా మారిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. వికారాబాద్ జిల్లా తాండూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో అనారోగ్యం పాలై నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని లీలావతిని హరీశ్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. వికారాబాద్ జిల్లా తాండూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఈ నెల 10న కిచిడీ తిని 15 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. మంచి ఆసుపత్రికి పంపకుండా హాస్టల్‌లో ఉంచి వారికి చికిత్స అందించారని పేర్కొన్నారు. నాలుగు రోజులు గడించినా అయినా వారు పూర్తి ఆరోగ్యవంతులు కాలేదు. విద్యార్థిని లీలావతిని నిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారని తెలిపారు. తోటి విద్యార్థులతో ఆడుతూ, పాడుతూ బడిలో పాఠాలు నేర్చుకోవాల్సిన ఆ చిన్నారి.. మౌనంగా ఇలా నిమ్స్ ఆసుపత్రి బెడ్‌పై ఉండటం చూస్తే మనసు కలిచివేస్తున్నదని ఆవేదన

..మిగతా 2లో

# ఐసీయూలో ఎల్‌కే అద్వానీ



**న్యూఢిల్లీ, డిసెంబర్ 14 (ప్రభాత ఉదయం):** బీజేపీ అగ్రనేత, మాజీ ఉప ప్రధాని లాల్ కృష్ణ అద్వానీ ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. శుక్రవారం రాత్రి అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆయన్ని ఢిల్లీలోని ఇంద్రప్రస్థ అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయనకు ఐసీయూలో చికిత్స అందిస్తున్నట్లు అపోలో ఆసుపత్రి వైద్యులు తెలిపారు. డాక్టర్ వినిత్ సూరి సంరక్షణలో ఆయనకు చికిత్స చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం అద్వానీ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం అద్వానీ వయసు 97 ఏళ్లు. ఆయన గత కొంతకాలంగా వయో సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది జూన్, జులై, ఆగస్టు నెలల్లో పలుమార్లు అస్వస్థతతో ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. తొలుత జూన్ 26న అద్వానీ అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. రెండు రోజుల చికిత్స అనంతరం ఆయన డిశ్చార్జ్ అయ్యారు. జులై 3న మరోసారి ఆయన అనారోగ్యం బారిన పడ్డారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో కుటుంబ సభ్యులు ఆయన్ని ఎయిమ్స్‌కి తరలించారు. చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయ్యారు. ఆ తర్వాత ఆగస్టు 6వ తేదీన మరోసారి ఆసుపత్రిలో చేరి చికిత్స అనంతరం ఇంటికి చేరారు. ఇప్పుడు మరోసారి అస్వస్థతకు గురయ్యారు.



పెళ్లి కొడుకు వేడుకలో పాల్గొన్న నాయకులు

## ఘనంగా వెంకట్ రెడ్డి పెళ్లి కొడుకు వేడుక

హైదరాబాద్, డిసెంబర్ 14(ప్రభాత ఉదయం) నల్గొండ జిల్లా కాంగ్రెస్ నాయకుడు, వ్యాపారవేత్త మేరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, స్వప్నిక ల కుమారుడు వెంకట్ రెడ్డి పెళ్లి కొడుకు వేడుక లెజెండ్ చెమ్స్ లో ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు అతిథులు హాజరై పెళ్ళికొడుకు వెంకట్ ను ఆశీర్వదించారు. వేడుకలో యు ఎస్ లో తెలుగు అసోసియేషన్ ప్రతినిధి శేరి విజయానంద రెడ్డి, గుమ్మడి జయ కుమార్, బీసీసీఐ మాజీ వైస్ చైర్మన్ రంగా రెడ్డి కుమారుడు ఎన్ ఆర్ ఐ సిద్ధార్థ్ రెడ్డి, మాజీ కో ఆపరేటివ్ సభ్యులు మూలమల్ల చక్ర గిరి వర్ధన్ రెడ్డి, రజినీ కాంత్ రెడ్డి, సృజయ్ రెడ్డి, శేరి రాజశేఖర్ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, అనిరుధ్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ నిర్లక్ష్యం గురుకుల పాలిట శాపం

మొదటి పేజీ తరువాయి...

వ్యక్తం చేశారు. ఆ విద్యార్థిని త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నానన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం అభం, శుభం తెలియని గిరిజన బిడ్డకు శాపంగా మారింది. తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగుల్చుతున్నది అని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. వాంకిడి గురుకుల విద్యార్థులకు చికిత్స అందించడంలో జరిగిన వైఫల్యం ఇక్కడ కనిపిస్తున్నది. మొన్న శైలజ మృతికి ప్రభుత్వం కారణం అయ్యింది. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో వరుస ఫుడ్ పాయిజన్లు జరిగి విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతుంటే ప్రభుత్వం ఏం చేస్తున్నట్టు రాష్ట్ర వ్యాప్తంగా కాదు, కనీసం సొంత జిల్లా ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలను సైతం పట్టించుకోని నిర్లక్ష్యపు ముఖ్యమంత్రి ఈ రేవంత్ రెడ్డి. గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ అభం శుభం తెలియని విద్యార్థులకు శాపం అవుతున్నదని ప్రాణాలను బలిగొంటుందని రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్ని సార్లు చెప్పినా అర్థం కావడం లేదు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. విద్యా మంత్రి, ఎస్సీ, ఎస్టీ మంత్రి కూడా రేవంత్ రెడ్డి. ముఖ్యమంత్రి వద్ద ఉన్న శాఖల నిర్వహణలో వైఫల్యం. చూడడానికి వెళ్తే ప్రతిపక్ష నాయకులను అడ్డుకుంటారు. సబితా ఇంద్రా రెడ్డిని, సత్యవతి రాథోడ్‌ని అరెస్టు చేశారు. ఢిల్లీ పెద్దలను ప్రసన్నం చేసుకోవడంపై ఉన్న ధ్యాస, కనీసం జిల్లాలో ఉన్న పిల్లల భవిష్యత్తుపై లేదా నిన్న నల్గొండ %-% కేతేపల్లి మండలం గురుకులంలో ఐదో తరగతి చదువుతున్న నీలం సాయి గణేష్ పాము కాటుకు గురయ్యాడు. ఆసుపత్రి పాలయ్యాడు. ఫుడ్ పాయిజన్ కేసులు, కుక్క కాట్లు, పాము కాట్లు, ఎలుక కాట్లు, కరెంటు షాక్‌లు నిత్య కృత్యం అవుతున్న ప్రభుత్వం ముద్దు నిద్ర వేడడం లేదు. ఇప్పటి వరకు 49 మంది విద్యార్థులు చనిపోతే ఉలుకు లేదు పలుకు లేదు అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

### కేసు విషయంలో ఎన్నో మాట్లాడాలని ఉన్నా

## కోర్టు ఆదేశాల మేరకు మాట్లాడలేకపోతున్నా

మొదటి పేజీ తరువాయి...

తన ప్రమేయం లేదని స్పష్టం చేశారు. గత 20 ఏళ్లుగా సంధ్య థియేటర్‌కు వెళ్తున్నానని, ఇప్పటి వరకు 30 సార్లు సంధ్య థియేటర్‌కు వెళ్లినట్లు తెలిపారు. ఇలాంటి దుర్ఘటన ఎప్పుడూ జరగలేదని అన్నారు. మరోవైపు జైలు నుంచి ఇంటికి చేరుకున్న అల్లు అర్జున్‌కు ప్రముఖుల నుంచి పరామర్శలు వెల్లువెత్తుతున్నాయి. నందమూరి బాలకృష్ణ స్వయంగా అల్లు అరవింద్‌కు ఫోన్ చేసి అల్లు అర్జున్‌తో మాట్లాడి పరామర్శించారు. ఈ మేరకు కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. 'పుష్ప' దర్శక నిర్మాతలతో పాటు హీరోలు విజయ్ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ, రానా, నాగచైతన్య, సుధీర్ బాబు, దర్శకులు రాఘవేంద్రరావు, కొరటాల శివ, వంశి పైడిపల్లి, బి.గోపాల్, ఆర్. నారాయణమూర్తి, నిర్మాతలు సురేశ్ బాబు, దిల్ రాజు, బీవీఎస్ఎస్ ప్రసాద్, సంగీత దర్శకుడు తమన్ సహా పలువురు సన్నిహితులు, మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, అవంతి శ్రీనివాస్‌లు అల్లు అర్జున్‌ను కలిసి మద్దతు ప్రకటించారు. కాసేపు అల్లు అరవింద్, అల్లు అర్జున్‌లతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ముఖ్యంగా చిరంజీవి సతీమణి సురేఖ అల్లుఅర్జున్ నివాసానికి చేరుకోగానే సోదరుడు అల్లు అరవింద్ దగ్గరుండి బన్నీ వద్దకు తీసుకెళ్లారు. తనను హత్తుకొని సురేఖ ఒకింత భావోద్వేగానికి గురికావడంతో అల్లు అర్జున్ కళ్లు చెమ్మగిల్లాయి. ఇలా సినీ, రాజకీయ ప్రముఖులు, సన్నిహితులతో అల్లు అర్జున్ నివాసం వద్ద సందడి నెలకొంది. మరోవైపు అభిమానులు ఎవరూ అర్జున్ నివాసానికి రాకుండా పోలీసులు మూడు వైపుల బారికెడ్లు ఏర్పాటు చేసి భారీ బందోబస్తు నిర్వహించారు. అల్లుఅర్జున్ అరెస్టుపై యావత్ చిత్ర పరిశ్రమ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. అరెస్టును ఖండిస్తూ పలువురు నటీనటులు తమ అభిప్రాయాలను, అభ్యంతరాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. సినిమా వాళ్లకు సంబంధించిన ఏ విషయంలోనైనా ప్రభుత్వ అధికారులు, మీడియా చూపించే ఉత్సాహం సాధారణ పౌరులపై కూడా ఉండాలని కోరుకుంటున్నట్లు నాని తెలిపారు. మంచి సమాజంలో జీవించాలన్నారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటన దురదృష్టకరమని, ఆ ఘటన నుంచి పరిశ్రమ ఎన్నో పాఠాలు నేర్చుకోవాలని సూచించారు. ఈ ఘటనలో ఒక వ్యక్తిని నిందించడం సరైనది కాదని నాని అభిప్రాయపడ్డారు. బాలీవుడ్ నటుడు వరుణ్ ధావన్ కూడా ఇదే అంశంపై ఓ సినీ వేడుకలో పరోక్ష వ్యాఖ్యలు చేశారు. భద్రతాపరమైన, ఇతర అంశాలను నటీనటులు ఒక్కరే చూసుకోలేరని, జాగ్రత్తగా ఉండాలని మాత్రమే వాళ్ల చుట్టుపక్కల వారికి సూచిస్తుంటారని వరుణ్ ధావన్ తెలిపారు. ఈ విషయంలో ఒక వ్యక్తిని మాత్రమే నిందించడం అన్యాయమన్నారు. పుష్ప-2 కథానాయిక రష్మిక కూడా బన్నీ అరెస్టుపై ఆవేదన వ్యక్తం చేసింది. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను తాను నమ్మలేకపోతున్నానని, సంధ్య థియేటర్ వద్ద దురదృష్టకరమని, ఆ ఘటన తన హృదయాన్ని కలచివేస్తుందని పేర్కొంది. అదే సమయంలో ఒకే వ్యక్తిని నిందించడం సబబు కాదని అల్లు అర్జున్‌కు రష్మిక తన మద్దతు ప్రకటించింది. థియేటర్ల వద్ద తొక్కిసలాట ఘటన బాధాకరమన్న నటుడు నితిన్ ఈ ఘటనను తప్పుపట్టడం కంటే దాన్ని నుంచి పాఠాలు నేర్చుకోవాలని సూచించారు. మరో కథానాయకుడు సందీప్ కిషన్ కూడా బన్నీ అరెస్టును తప్పుపట్టారు. ఊహించని ఘటనలో ఒకే వ్యక్తి ఎలా బాధ్యత వహించగలరని ప్రశ్నించారు. దర్శకుడు అనిల్ రావిపూడి కూడా స్పందిస్తూ సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటన మెరుగైన భద్రత అవసరాలను గుర్తు చేస్తుందన్నారు. ఇలాంటి ఘటనలు పురావృతం కాకుండా చూసుకుందామని పిలుపునిచ్చిన అనిల్, బాధిత కుటుంబాన్ని ఆదుకోవడంలో అర్జున్ బాధ్యతాయుతంగా వ్యవహరించారన్నారు. అలాంటి వ్యక్తిని ఒక్కరినే బాధ్యత వహించమనడం సరైన నిర్ణయం కాదని అనిల్ అభిప్రాయపడ్డారు. మరో దర్శకుడు అజయ్ భూపతి అల్లు అర్జున్ అరెస్టును ఖండించారు. దర్శకుడు రాంగోపాల్ వర్మ అల్లు అర్జున్ అరెస్టుపై ప్రభుత్వాలకు నాలుగు ప్రశ్నలు సంధించారు. పుష్కరాలు, బ్రహ్మోత్సవాల్లాంటి ఉత్సవాల్లో తోపులాటలో భక్తులు పోతే దేవుళ్లు అరెస్టు చేస్తారా అంటూ ప్రశ్నించారు. ఎన్నిక ప్రచారాల తొక్కిసలాటలో ఎవరైనా చనిపోతే రాజకీయ నాయకులన్ని అరెస్టు చేస్తారా అని ప్రశ్నించిన వర్మ, ప్రీ రిలీజ్ ఫంక్షన్లలో ఎవరైనా పోతే హీరో హీరోయిన్లను అరెస్టు చేస్తారా అంటూ తనదైన శైలిలో ప్రశ్నల వర్షం కురిపించారు.

# దేశానికే ఆదర్శంగా కులగణన

మొదటి పేజీ తరువాయి...



తెలంగాణ పునర్‌నిర్మాణంలో భాగస్వాములు కావాలనేది ప్రభుత్వ కోరిక. ఈ కురుమ భవనం విద్యకు వేదిక కావాలని అన్నారు. కురుమలకు, యాదవులకు రెండేసి చొప్పున ఎంపీ సీట్లు ఇచ్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. కురుమలను గెలిపించుకోవాల్సిన బాధ్యత వారిపైనే ఉ ఒదన్నారు. గెలవకపోతే టికెట్లు ఎందుకు ఇచ్చారని ప్రశ్నలు వస్తాయని చెప్పారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య కురుమ వర్గానికి చెందిన వ్యక్తినేనని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉ ఒదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎట్టిపరిస్థితుల్లో ఎస్సీ కులాలకు అన్యాయం చేయనని, రిజర్వేషన్ల విషయంలో అందరికీ న్యాయం చేసే బాధ్యత తనదేనని తెలిపారు. హైదరాబాద్ లోని హెూటల్ దసపల్లాలో గ్లోబల్ మాదిగ డే %-% 2024 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తరాల నుంచి ఎస్సీ వర్గీకరణ కోసం ఓ వర్గం చేస్తున్న పోరాటానికి మద్దతుగా.. ఇటీవల సుప్రీం కోర్టు నుంచి సానుకూల తీర్పు వెలువడింది. దానిని ప్రస్తావించిన సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సుప్రీంకోర్టులోని మాదిగ ఉపకులాల రిజర్వేషన్ల కేసులో బలమైన వాదనలు వినిపించినట్లు వెల్లడించారు. ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ లో కాంగ్రెస్ పార్టీ మాదిగ కుల ఉపకులాల రిజర్వేషన్లపై స్పష్టమైన విధానాన్ని తెలియజేసిందని తెలిపారు.ఎస్సీ వర్గీకరణ అంశంపై ఎన్నికల సమయంలోనే తమ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టమైన ప్రకటన చేశారని గుర్తు చేసిన సీఎం రేవంత్ రెడ్డి.. మాదిగలకు సంబంధించి అనుకూల నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు దానంతట అదే రాలేదని వ్యాఖ్యానించిన సీఎం రేవంత్ రెడ్డి.. మాదిగలకు అనుకూలంగా తీర్పు రావటంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ గారి నేతృత్వంలో ప్రత్యేకంగా న్యాయవాదులను నియమించి వాదనను వినిపించినట్లు తెలియజేశారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు విలువరించటంతో ఇక రాష్ట్ర ప్రభుత్వం సైతం ఆ తీర్పును తూచా తప్పకుండా అమలు చేస్తుందని శాసనసభ వేదిక ప్రకటించినట్లు సీఎం తెలిపారు. తెలంగాణ సమస్యలానే ఎస్సీ వర్గీకరణ సమస్యను జఠిలంగా మారిపోయిందన్న సీఎం రేవంత్ రెడ్డి.. ప్రజల ఆకాంక్ష మేరకు ప్రభుత్వాలు నిర్ణయం తీసుకుని అమలు చేయాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. తరాలుగా మాదికలు ఆకాంక్షిస్తున్నట్లుగా రిజర్వేషన్ల వర్గీకరణ అంశంలో న్యాయం ఉందని.. వారికి న్యాయం చేయాలని ఆలోచన తమ ప్రభుత్వానికి ఉందని తెలిపారు. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణను అమలు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే కార్యచరణ మొదలుపెట్టిందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా వర్గీకరణను అమలు చేసేందుకు చేపట్టాల్సిన విధివిధానాలు పై అధ్యయనం చేసేందుకు అధ్యయనం చేస్తున్నామని, అందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించినట్లు తెలియజేశారు. 60 రోజుల్లో నివేదిక ఇవ్వాలని జ్యూడిషియల్ కమిషన్ సైతం నియమించినట్లు వెల్లడించారు. మరో వారం రోజుల్లో నివేదిక వచ్చే అవకాశం ఉందని, దాని ఆధారంగానే ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం మాదిగ కులస్తులు అడగకుండానే ప్రభుత్వంలో మంచి అవకాశాలు కల్పిస్తున్నామన్న సీఎం రేవంత్ రెడ్డి.. సీఎం పేషీలో ఆ సామాజిక వర్గం వాళ్లు ఉ ఒడాలనే ఉద్దేశ్యంతోనే డాక్టర్ సంగీతను నియమించినట్లు తెలిపారు. వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఉస్మానియా యూనివర్శిటీలో ఎన్నడూ లేనివిధంగా వైస్ ఛాన్స్ లర్ గా ఈ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని నియమించినట్లు తెలిపారు. %××% వీసీగా, విద్యా కమిషన్ మెంబర్ గా, ఉన్నత విద్యా శాఖలో మాదిగ సామాజిక వర్గానికి అవకాశం కల్పించామంటూ ప్రకటించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న స్కిల్ యూనివర్సిటీ బోర్డు డైరెక్టర్ గాను పగిడిపాటి దేవయ్యను నియమించామన్న రేవంత్ రెడ్డి.. తాను ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం మాదిగ సామాజిక వర్గానికి అన్యాయం జరగదని, జరగనివ్వనని తెలిపారు. ఎస్సీలకు న్యాయం చేసేందుకు అన్ని విషయాలు విధాలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అయితే ఎస్సీ వర్గీకరణ అమల్లో కొంత ఆలస్యం కావచ్చని.. కానీ తప్పక న్యాయం జరుగుతుందని ఈ విషయంలో ఎవరికీ ఎటువంటి అనుమానాలు అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో ఎస్సీ వర్గీకరణను సమర్థవంతంగా అమలు చేసి బాధితులకు న్యాయం చేసే బాధ్యత తనదేనని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## చిత్తశుద్ధితో గురుకులాల ప్రక్షాళన



గురుకులాల ప్రక్షాళన కోసం ప్రభుత్వం సిద్ధం

ప్రతి నెల 10లోపు విద్యా సంస్థలకు నిధులు

ఇటీవలే గురుకులాల డైట్ ఛార్జీలు పెంచాం

గురుకులాల బాటను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం

గురుకుల పాఠశాలను సందర్శించిన సీఎం

గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో కామన్ డైట్ ప్రారంభం

హైదరాబాద్, డిసెంబర్ 14 (ప్రభాత ఉదయం): ఇటీవలే గురుకులాల డైట్ ఛార్జీలు పెంచాం. గురుకులాల బాట కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. ప్రైవేటు స్కూళ్ల విద్యార్థులు గురుకులాల విద్యార్థుల కంటే ఎక్కువనే భావన ఉ ఒది. గురుకులాలు అంటే బహుముఖ ప్రతిభకు కేంద్రాలు అనే గుర్తింపు తీసుకురావాలి. గురుకులాల వ్యవస్థను పీవీ నరసింహారావు హయాంలో తీసుకొచ్చారు. టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం ఒకప్పటి గురుకుల విద్యార్థే. మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి కూడా గురుకులాల విద్యార్థే. గురుకులాల విద్యార్థులు ఎందరో ఉన్నతస్థాయికి వెళ్లారు.' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా చిలుకూరులో గురుకుల పాఠశాలను సీఎం రేవంత్ రెడ్డి సందర్శించారు. అనంతరం గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో కామన్ డైట్‌ను ప్రారంభించారు. ప్రైవేట్ స్కూళ్లు వచ్చాక కొంతవరకు గురుకులాల ప్రభావం తగ్గిందని సీఎం అన్నారు. గురుకులాల ప్రక్షాళన కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పదేళ్లుగా బీఆర్ఎస్ సర్కారు డైట్ ఛార్జీలు పెంచలేదని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక గురుకులాల డైట్ ఛార్జీలు పెంచామని పేర్కొన్నారు. 40 శాతం డైట్ ఛార్జీలు, 200 శాతం కాస్మోటిక్ ఛార్జీలు పెంచడం చరిత్ర అని సీఎం అన్నారు. 16 ఏళ్లలో ఒక్కసారైనా కాస్మోటిక్ ఛార్జీలు పెంచలేదని మండిపడ్డారు. పారు. డైట్ ఛార్జీలు పెంచి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నామన్నారు. విద్యార్థులపై పెడుతున్న పెట్టుబడి ఖర్చు కాదని, భవిష్యత్తులో పునర్ నిర్మాణం కోసం పెట్టే ఖర్చు అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. గురుకులాల్లో మార్పులు తీసుకు వస్తున్నామని, ఇక్కడి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని సీఎం తెలిపారు. "ఆర్థిక ఇబ్బందుల వల్ల పిల్లలను హాస్టళ్లలో పెడుతున్నారు. మనల్ని నమ్మి తల్లిదండ్రులు పిల్లలను గురుకులాల్లో పెడుతున్నారు. విద్యార్థుల మృతిపై మనం ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం, సిబ్బందిపై ఉంది. గతంలో డైట్ విషయంలో బిల్లులు రాలేదని నాణ్యత తగ్గిస్తున్నామని చర్చలు వస్తున్నాయి. ప్రతి నెల 10లోపు గ్రీన్‌ఛానల్ ద్వారా అన్ని విద్యాసంస్థలకు సంబంధించిన నిధులు వస్తాయి. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో ఉచితంగా కరెంట్ ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చాం. ప్రతి రోజు అధికారులు డైట్ తిని, నాణ్యత చూడాలని సూచించామన్నారు. 75 ఐటీఐలను ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేశామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఐటీఐల్లో చేరితే కచ్చితంగా ఉద్యోగం వస్తుందని అవగాహన కల్పించాలని సీఎం ఆదేశించారు. రంగారెడ్డి జిల్లాలోనే యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీ ఉందని గుర్తు చేశారు. స్కిల్స్ వర్సిటీ దేశానికే ఆదర్శమని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు. చిన్నారులతో సీఎం రేవంత్ రెడ్డి కాసేపు ముచ్చటించి, మధ్యాహ్న భోజనం వారితో కలిసి చేశారు.

## తెలంగాణలో కొత్త రైల్వే మార్గాలను ఏర్పాటు చేయండి

### రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరిన సిఎం

హైదరాబాద్, డిసెంబర్ 14 (ప్రభాత ఉదయం): తెలంగాణలో కొత్త రైల్వే మార్గాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ ను కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. అందులో భాగంగా రైల్వే మంత్రిని కలిసి రాష్ట్రంలో రైల్వే నెట్ వర్క్ విస్తరణ గురించి కీలక విషయాలు చర్చించారు. కాజీపేటలో ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీని నెలకొల్పాలని కోరారు. కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు అనేది తెలంగాణ ప్రజల చిరకాల కోరిక అన్నారు. దాన్ని సాకారం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ గురించి ప్రస్తావించిన విషయాన్ని గుర్తు చేశారు. కాజీపేటలో పీరియాడిక్ ఓవర్ హాల్ వర్క్ షాప్ (పీఓహెచ్) ఏర్పాటు చేస్తామని రైల్వే మంత్రిత్వ శాఖ ప్రకటించిందని, కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని కోరుతూ తాను లేఖ రాశానని గుర్తు చేశారు. అటు తెలంగాణలో కొత్త రైల్వే మార్గాలను నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి, రైల్వేమంత్రిని కోరారు. వికారాబాద్-కృష్ణా స్టేషన్ల మధ్య రైల్వేశాఖ పూర్తి నిధులతో కొత్త రైల్వే మార్గాన్ని నిర్మించాలని రిక్వెస్ట్ చేశారు. ఈ మార్గాన్ని అభివృద్ధి చేయడం వల్ల దక్షిణ తెలంగాణలో, ముఖ్యంగా అభివృద్ధి చెందని పరిగి, కొడంగల్, ఇతర పరిసర ప్రాంతాలలో సిమెంట్ క్లస్టర్లు సహా ఇతర పారిశ్రమలు అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. అటు కల్వకుర్తి-మాచర్ల మధ్య కొత్త రైల్వే మార్గానికి ఆమోదం తెలపాలని రేవంత్ రెడ్డి, అశ్వినీ వైష్ణవ్ ను కోరారు. వంగూరు, కందుకూరు, దేవరకొండ, చలుకుర్తి, తిరుమలగిరి మీదుగా కల్వకుర్తి నుంచి మాచర్లకు అనుసంధానం చేసే ప్రతిపాదిత మార్గం ప్రస్తుతం ఉన్న మాచర్ల మార్గాలతో అనుసంధానమై కనెక్టివిటీ మెరుగుపడుతుంది. మరోవైపు డోర్నకల్-మిర్యాలగూడ (పాపతపల్లి-జాన్ పహాడ్), డోర్నకల్-గద్వాల్ మధ్య ప్రతిపాదిత రైల్వే మార్గాలను సమీక్షించాలని కోరారు. ఈ రెండు ప్రతిపాదిత మార్గాల అలైన్‌మెంట్‌ను పునరా లోచించాని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రిక్వెస్ట్ పై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందించారు. మూడు రోజుల పాటు కొనసాగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి చర్చించారు. పలు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు. ముఖ్యమంత్రి వెంట ఎంపీలు అనిల్ కుమార్, మల్లు రవి, సురేష్ షెట్కార్, పోరిక్ బలరాం నాయక్, చామ కిరణ్ కుమార్ రెడ్డి, గడ్డం వంశీ, కడియం కావ్య, రామసహాయం రఘురామిరెడ్డి, కుందూరు రఘువీర్, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్, మాజీ ఎంపీ హన్మంతరావు ఉన్నారు.

## ఇలాంటి ఘటనలు జరిగితే మీరు ఊరుకుంటారా రాహుల్‌జీ

### రాహుల్ గాంధీని నిలదీసిన కేటీఆర్



హైదరాబాద్, డిసెంబర్ 14 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ సర్కార్ చేపట్టిన కూల్చివేతలపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని కేటీఆర్ ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు మీ కుటుంబంలో జరిగితే, అంగీకరించగలరా.. రాహుల్ గాంధీ జీ అని కేటీఆర్ అడిగారు. పట్టింపు, మానవత్వం లేని ప్రభుత్వాలే ఇలాంటి చర్యలకు పాల్పడుతాయి. తెలంగాణలో ఇంట్లో ఇద్దరు మహిళలు ఉండగానే.. బుల్డోజర్లతో ఆ ఇండ్లను కూలగొట్టారు. మరి వారి భౌతిక భద్రతకు ఎవరూ బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. పేదలకు ప్రేమ పంచుతాం అనడం అంటే ఇదేనేమో అని కేటీఆర్ విమర్శించారు.

## అంతువులలో పరాన్న జీవుల వల్ల కలిగే అనర్థాలను నివారించడానికి తీసుకోవల్సిన జాగ్రత్తలపై

# ఈ నెల 17 నుంచి 19 వరకు రాజేంద్రనగర్ లో జాతీయ సదస్సు



రాజేంద్రనగర్ లోగల పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం పరిపాలన భవనం




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ డాక్టర్ శరత్ చంద్ర, డాక్టర్ ఎం ఉదయ్ కుమార్, డాక్టర్ సీ హెచ్ సత్యనారాయణ లు

రాజేంద్రనగర్, డిసెంబరు 14 (ప్రభాత ఉదయం) జంతు, మానవ ఆరోగ్య పరిరక్షణ కోసం పశువులలో ఉండే పరాన్న జీవులను నివారించడానికి తీసుకోవల్సిన కాగ్రత్తలపై ఈ నెల 17 నుంచి 19వ తేదీలలో రజేంద్రనగర్ లో జాతీయ స్థాయిలో సదస్సు నిర్వహించనున్నట్లు పీవీ నర్సింహ్మారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాయం. రిజిస్ట్రార్ డాక్టర్ ఎ. శరత్ చంద్ర తెలిపారు. శనివారం రాజేంద్రనగర్ లోని పశు వైద్య విశ్వవిద్యాలయం సెమినార్ హాల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 33వ నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ వెటర్నరీ పారసైటాలజీ అండ్ నేషనల్ సింపోజియం చైర్మన్, కార్యనిర్వాహక కార్యదర్శి, పశువైద్య విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ ప్యాకల్టీస్ డాక్టర్ ఎం.ఉదయ్ మార్, పశు వైద్య కళాశాల విస్తరణ విభాగం హెడ్ డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ లతో కలసి వివరాలు వెల్లడించారు, వశు వైద్య పరిశోధనలలో ఫెటర్నరీ పారాసైటాలజీ పరిశోధనలలో నూతనంగా అభివృద్ధి చెందుతున్న విధానాల గురించి ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, పరిశోధనా విద్యార్థులు, పీజీ. విద్యార్థులు. -వెటర్నరీ పారాసైటాలజీ నిపుణులతో చర్చా గోష్టి ఉంటుందన్నారు. వెటర్నరి పారాసైటలాజిపై హైదరాబాద్ లో మొదటి సారిగా జాతీయ సదస్సు ను నిర్వహించడం జరుగుతుందన్నారు. పశువు లలో పరాన్న జీవుల వలన వచ్చే వ్యాధులు. వాటి నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై లోతైన పరిశోదనలు ఆవసరం అన్నారు. ఆ పరిశోధనలు రైతులకు చేరవేయడానికి తీసుకోవల్సిన జాగ్రత్తలపై చర్చించడం జరుగుతుందన్నారు. ప్రాంతాల వారిగా రైతు కు ఉన్న ఇబ్బందులను, సవాళ్లను అదిగమించడానికి ఈ సదస్సు ఎంతగానో దోహదపడుతుందన్నారు.



పరిపాలన భవనంలో మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావు విగ్రహం



రిజిస్ట్రార్ డాక్టర్ శరత్ చంద్ర




సదస్సు కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం ఉదయ్ కుమార్

### సదస్సులో ల్యాండ్ టు ల్యాబ్ లాంటి అనేక కార్యక్రమాలు: డాక్టర్ ఎం ఉదయ్ కుమార్

సదస్సు చైర్మన్ డీన్ ఆఫ్ వెటర్నరీ ప్యాకల్టీస్ డాక్టర్ ఎం. ఉదయ్ కుమార్ మాట్లాముతూ, పౌల్ట్రీ , డైరీ, గొర్రెలు, మేకలలలో పరాన్నజీవులు వాటి నియంత్రణ, తీసుకోవల్సిన జాగ్రత్తలతో పాటు పార్మ సూటికల్ రిప్రజెంటివ్ లకు తగు సూచనలు , సలహాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇతర జీవులపై ఆధార పడి జీవించే వాటిని పరాన్న జీవులు అని అంటారని గుర్తు చేశారు. వీటిలో అంతర పరాన్న జీవులు, భావ్య పరాన్న జీవులు ఉంటాయని అవి లెక్కకు మించి ఉండటం వల్ల పశు సంతతిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. ఈ సదస్సులో ల్యాండ్ టు ల్యాబ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, రైతులతో ముఖాముఖి ఏర్పాటు చేసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించడం జరుగుతుందన్నారు. పశు సంతతిలో వస్తున్న పరాన్న జీవుల వల్ల నష్టాలను తగ్గించడానికి ఈ సదస్సు ఎంతగానో దోహదపడుతుందన్నారు.

### సదస్సులో పాల్గొననున్న ముఖ్యులు :

ఈ సదస్సు ప్రారంభోత్సవంలో తెలంగాణ రాష్ట్ర పశు సంవర్ధక, డైరీ డెవలప్మెంట్ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సభ్యసాచి ఘోష్ , నేషనల్ ఫిషరీస్ డెవలప్మెంట్ బోర్డ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ బిజయ్ కుమార్ బెహర, తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ బి గోపి, తమిళనాడు వెటర్నరీ కళాశాలకు చెందిన డిపార్ట్మెంట్ ఆఫ్ పారా సైటాలజీ హెడ్, సదస్సు అధ్యక్షులు డాక్టర్ ఎ . సంఘూరన్ , రాజేంద్రనగర్ పశువైద్య కళాశాల అసోసియేట్స్ డాక్టర్ డి మాధురి , జమ్ముకు చెందిన డాక్టర్ అనీష్ యాదవ్, దేశంలోని వివిధ విద్యాలయాలనుంచి విశ్వవిద్యాలయాల నుంచి శాస్త్రవేత్తలు పాల్గొంటారన్నారు.




విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర అడిషనల్ డీజీపీ స్వాతీ లక్ర

## ప్రభుత్వ సంక్షేమ గురుకులాలలో మెస్, కాస్మోటిక్ చార్జీలను మెంచి నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్న ప్రభుత్వం : స్వాతీలక్ర

బుద్వేల్, డిసెంబరు14(ప్రభాత ఉదయం): ప్రభుత్వ సంక్షేమ గురుకులాలలో చదువుకుంటున్న విద్యార్థులకు డైట్ చార్జీలను, కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం పెద్ద ఎత్తున పెంచిందని, విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను చేరుకుని తల్లిదండ్రులకు, తాము చదువుకున్న గురుకులాలలకు, రాష్ట్రానికి 'పేరు తీసుకురావాలని తెలంగాణ రాష్ట్ర అడిషనల్ డీజీపీ స్వాతీలక్ర అన్నారు. రాజేంద్రనగర్ లోని గిరిజన బాలుర ఐఐటీ స్టడీ సెంటర్ లో పెరిగిన అహార పట్టిక ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని అహార పట్టికను ప్రారంబించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాజేంద్రనగర్ గిరిజన బాలుర ఐఐటీ స్టడీ సెంటర్ కు రాష్ట్రం లోనే మంచి పేరుందని, పెరిగిన మెస్, కాస్మోటిక్ చార్జీల నేపథ్యంలో విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండ బాగా చదువుకోవాలన్నారు. ఇంటర్ విద్యార్థులకు నెలకు డైట్ చార్జీలు రూ.1500 ఉండగా వాటిని రూ. 2100లకు పెంచిందని, అంటే 40శాతం ఎక్కువ చేసిందని గుర్తు చేశారు. కాస్మోటిక్ చార్జీలను నెలకు రూ.62 ఉండగా ప్రస్తుతం రూ.200లకు పెంచి 200శాతం ఎక్కువ చేసిందన్నారు, దీని వల్ల రాష్ట్రంలోని 8 లక్షల మంది విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. పెరిగిన చార్జీల పల్ల ప్రభుత్వంపై సంవత్సరానికి రూ. 470 కోట్లు ఆర్థిక భారం పడుతున్నప్పటికీ విద్యారుల సంక్షేమం కోసం ఈ విదంగా చేసిం దన్నారు. ఆహార భద్రత నిర్ధారించడానికి, అహార కాలుశ్యం , ఆహారం వల్ల కలిగే అనారోగ్యాలను నివారించడానికి సంస్తాగత యం త్రాంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం రాష్ట్ర స్థాయి. సంస్థ స్థాయిలో టాస్క్ పోర్స్ కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. ఆహార ముడి సరుకుల నిల్వ, కిచెన్ ఫ్లోర్ మేనేజ్మెంట్, అహార సరుకుల కొనుగోలు, డైనింగ్ ఏరియా మేనేజ్మెంట్, అహారం వడ్డించే పద్ధతుల ప్రమాణీకరణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ గిరిజన ఐఐటీ స్టడీ సెంటర్ ప్రిన్సిపాల్ విజయరామిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ విజయేందర్ రెడ్డి, గిరిజన ఐ ఏ ఎస్ స్టడీ సర్కిల్ ప్రిన్సిపాల్ శారధ, డైరెక్టర్ మదిలేట్టి తో పాటు అధ్యాపకులు, విద్యారులు పాల్గొన్నారు.



బుద్వేల్ శ్రీ అయ్యప్ప సేవా సమితి సభ్యులు

## బుద్వేల్ శ్రీ అయ్యప్ప సేవా సమితి అధ్యక్షులుగా ఆర్. దేవేందర్ గౌడ్ గురుస్వామీ

బుద్వేల్, డిసెంబరు14(ప్రభాత ఉదయం): బుద్వేల్ శ్రీ అయ్యప్ప స్వామీ సేవా సమితి అద్యక్షులుగా ఆర్ దేవేందర్ గౌడ్ గురుస్వామీ నియమితులైనారు. శనివారం బుద్వేల్ లో జరిగిన అయ్యప్ప స్వాముల సమావేశంలో నూతన కమిటీని ఎంపిక చేశారు. ఉపాద్యక్షులుగా స్వామ లు ఎస్. చెన్నారెడ్డి, ఆర్. రాకేశ్ గౌడ్, కె.నరేశ్ గౌడ్, ఎం.నిరంజన్ గౌడ్ , ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ ఇంద్రసేనారెడ్డి గురుస్వామీ, సంయుక్త కార్యదర్శిగా ఆర్. శ్రీనివాస్ గౌడ్ గురుస్వామీ, కోశాధికారిగా బి.అనిల్ రెడ్డి గురుస్వామీ, కార్యనిర్వాహక కార్యదర్శులుగా స్వాములు డి.రాజు యాదవ్, కె.శ్రీరాంగౌడ్, ఆర్.దన్ రాజ్, జి.హరికిరణ్ గౌడ్, వి.వెంకట్ రెడ్డి, జి.నిఖిల్ కుమార్, జి.నర్సిం హ్మా, కార్యవర్గ సభ్యులుగా ఎం.నాగరాజు, డి.రాజ్ కుమార్ యాదవ్, డి.జగదీశ్ యాదవ్, పి.మోహన్, సీహెచ్ సత్యసాయిరాం గౌడ్, సలహాదారులుగా పి.దేవేందర్ గౌడ్, పి.హరిచరణ్ గౌడ్, పి.శ్రీకాంత్, వి.క్రిష్ణ లు నియమితులైనారు.



## మైనార్టీల పట్ల ఎటువంటి వివక్ష లేదు

### వారి అభివృద్ధికి అన్ని రకాల చర్యలు : కేంద్రమంత్రి కిరణ్ రిజిజు


న్యూఢిల్లీ, డిసెంబర్ 14(ప్రభాత ఉదయం) మైనార్టీల పట్ల ఎటువంటి వివక్ష ప్రదర్శించడం లేదని, వారి అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. లోక్‌సభలో రాజ్యాంగంపై జరుగుతున్న చర్చలో మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించడం జరిగిందన్నారు. ఫ్రాన్స్, స్పెయిన్, ఇండోనేషియా లాంటి దేశాల్లో ఉన్న ముస్లింలతో పోలిస్తే, భారత్‌లో ముస్లింలు బెటర్‌గా ఉన్నట్లు చెప్పారు. అందుకే పొరుగు దేశాల్లో ఉంటున్న ముస్లింలు కూడా ఆశ్రయం కోరుతున్నారని కేంద్ర మంత్రి తెలిపారు. ఇతర దేశాల్లో మైనార్టీలకు కల్పిస్తున్న ఓటింగ్ హక్కుల గురించి కూడా మంత్రి రిజిజు తెలిపారు. దేశం గురించి మాట్లాడే సమయంలో జాగ్రత్తగా ఉండాలని, ఎందుకంటే ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారత ఇమేజ్‌పై ప్రభావం పడే అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. తమ హక్కులను కాపాడుకునేందుకు మైనార్టీలకు న్యాయరక్షణ కల్పిస్తోందని మంత్రి రిజిజు తెలిపారు. ప్రజాస్వామ్య రంగంలో భారత్‌తో ఏ దేశాన్ని కూడా పోల్చలేమన్నారు. దేశ ఆర్థిక ప్రగతిలో చాలా గ్యాప్‌లు ఉన్నాయని, అందుకే ప్రధాని మోదీ వికసిత్ భారత్ నినాదాన్ని ఇచ్చినట్లు వెల్లడించారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని ఏళ్లు గడుస్తున్నా.. భారత్‌ను అభివృద్ధి దేశంగా ఎందుకు మార్చలేకపోయారని అడిగారు.

# ప్రారంభమైన క్రిస్మస్ సందడి

బిషప్ రేచల్ జ్యోతి కొమానపల్లి అమ్మ తో దానియేలు భీమయ్య కుటుంబ సభ్యులు



బుద్వేల్,డిసెంబరు14(ప్రభాత ఉదయం): నగరంలో క్రిస్మస్ సందడి ప్రారంభమైంది. చర్చి లలో సెమీ క్రిస్టమస్ వేడుకలు నిర్వహిస్తూ సంబరాలు చేసుకుంటున్నారు. చర్చీ ల ఆద్వర్యంలో క్యారెల్స్ చేస్తూ ఏసుక్రీస్తు జనన విధానాన్ని ప్రజలకు ప్రకటిస్తున్నారు. చర్చీలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరిస్తూ ముస్తాబు చేస్తున్నారు.



క్రిస్మస్ స్టార్ వద్ద...



పశువుల పాకలో యేసయ్య ను దర్శించుకుంటూ

## ఏడుపాయల వన దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే రోహిత్

మెదక్, డిసెంబర్ 14(ప్రభాత ఉదయం) ఏడుపాయల వనదుర్గభవాని మాతను మెదక్ శాసనసభ్యులు డాక్టర్ మైనంపల్లి రోహిత్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నియోజక వర్గ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వహకులు ఎమ్మెల్యే రోహిత్ ను శాలువాతో సత్కరించారు.



ఎమ్మెల్యే రోహిత్‌ను సన్మానిస్తున్న ఆలయ నిర్వహకులు



మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌ను ఆశీర్వదిస్తున్న పాస్టర్లు

## మెదక్ కెథ్రిడల్ చర్చి ఉత్సవాలకు 29 కోట్లు నిధుల మంజూరు: ఎమ్మెల్యే రోహిత్

మెదక్, డిసెంబర్ 14(ప్రభాత ఉదయం) మెదక్ కెథిడ్రల్ చర్చిలో వందేళ్ళ మహా దేవాలయ ఉత్సవాల సందర్భంగా 29 కోట్ల ర్పూపాయల నిధుల మంజూరుకై నియోజక వర్గ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ కృషి చేశారు. శనివారం నిధులు మంజూరు కోసం కృషిచేసిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ను మెదక్ కెథిడ్రల్ పాస్టర్స్ ఆశీర్వదించారు.



ఎమ్మెల్యే రోహిత్‌కు మెమొంటో అందజేస్తున్న పూజారులు

## శ్రీశ్రీశ్రీ జగద్గురు దత్తాత్రేయ స్వామి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి: ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

మెదక్, డిసెంబర్ 14(కదా ఉదయం)శ్రీశ్రీశ్రీ జగద్గురు దత్తాత్రేయ స్వామి ఆశీస్సులతో ప్రజల సుభిక్షంగా ఉండాలని మెదక్ శాసనసభ్యులు డాక్టర్ మైనంపల్లి రోహిత్ అన్నారు. శనివారం శ్రీశ్రీశ్రీ జగద్గురు దత్తాత్రేయ స్వామి జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే రోహిత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజక వర్గ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ కు ఆలయ

## రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలి: న్యాయమూర్తి నీలిమ




లోక్ అదాలత్ లో మాట్లాడుతున్న న్యాయమూర్తి నీలిమ

### కేసుల సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్ లను సద్వినియోగం చేసుకోవాలి

### లోక్ అదాలత్ లో 2,285 కేసుల పరిష్కారం

రాజేంద్రనగర్, డిసెంబర్ 14(ప్రభాత ఉదయం) రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని రాజేంద్రనగర్ మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ , 11 వ అదనపు న్యాయమూర్తి నీలిమ అన్నారు. శనివారం రాజేంద్రనగర్ లో జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ , 11 వ అదనపు న్యాయమూర్తి నీలిమ ఆద్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా మొత్తం 2285 కేసులను పరిష్కరించారు. ఇందులో రాజీపడిన కేసులు 155, అడ్మిషన్ కేసులు 341, డంకన్ డ్రైవ్ కేసులు 840 , ఇ-పెట్టి కేసులు 549 విద్యుత్ చౌర్యం కేసులు 169, సైబర్ క్రైమ్ 231 కేసులను పరిష్కరించారు, ఈ కార్యక్రమంలో 12వ అదనపు న్యాయమూర్తి రాజ్ కిరణ్, 13 వ అదనపు న్యాయమూర్తి అంకిత్ సర్వ, స్పెషల్ కోర్టు న్యాయమూర్తి రవికుమార్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ప్రవీణ్ నాయక్, సంగీత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, లోక్‌అదాలత్ సభ్యులు సుదర్శన్, సుధాకర్ రెడ్డి, సుజాత, వరప్రసాద్, శ్రీనివాసులు, కోర్టు సిబ్బంది రవీందర్, వెంకటరంగారెడ్డి, భాస్కర్, నరేష్ గౌడ్, సంబంధిత ఠాణాల ఎస్ హెచ్ ఓ లు, సిబ్బంది , బార్ అసోసియేషన్ సభ్యులు, ఇతరులు పాల్గొన్నారు.



# గ్రూప్-2 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు: జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

**జిల్లా వ్యాప్తంగా 25 పరీక్షా కేంద్రాల్లో హాజరు కానున్న 8,722 మంది అభ్యర్థులు**

**పరీక్షా కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ ( 144 సెక్షన్) అమలు**

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 14(ప్రభాత ఉదయం) అభ్యర్థులు సూచించిన నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని జిల్లా ఎస్పీ టి శ్రీనివాస రావు సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ... ఈ నెల 15 ,16 (ఆదివారం ,సోమవారం) తారీఖులలో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (TGPSC) ఆధ్వర్యంలో జరుగనున్న గ్రూప్-2 కేంద్రాల వద్ద జిల్లా లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లను చేసినట్లు జిల్లా ఎస్పీ టి శ్రీనివాస రావు తెలియజేశారు. గద్వాల్ జిల్లా కేంద్రంలోని 22 పరీక్ష కేంద్రాలు, ఎర్రవల్లి చౌరస్తా లో 3 పరీక్షా కేంద్రాలు మొత్తం 25 కేంద్రాల వద్ద సుమారుగా 150 మంది పోలీసు అధికారులు మరియు సిబ్బందితో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 8722 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని, అందుకు సంబంధించి 5 రూట్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే పరీక్షా కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ ( 144 సెక్షన్) అమలు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరీక్షకు వచ్చే అభ్యర్థులకు, పరీక్షా కేంద్రాల వద్ద భద్రతకు సంబందించి పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల వెలుపల భాగంలో పోలీస్ యంత్రాంగం విధులను నిర్వర్తిస్తుందని పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్ నందు సూచించబడిన నిబంధనలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు నిర్ణీత సమయానికి ముందే చేరుకునేలా ఉండాలని, పరీక్షా కేంద్రంలో విధులు నిర్వర్తించే ప్రతి ఒక్క వ్యక్తి కచ్చితంగా గుర్తింపు కార్డులను కలిగి ఉండాలని లేని వారిని లోనికి అనుమతించడం జరగదని తెలిపారు. పరీక్షా కేంద్రం పరిసర ప్రాంతాలలో 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమల్లో ఉన్నందున ప్రజలు ఎవరు గూమికూడి ఉండకూడదని తెలిపారు. పరీక్ష కేంద్రం 500 మీటర్ల దూరం వరకు ఎలాంటి జిరాక్స్ సెంటర్లు తెరిచి ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. పరీక్షా కేంద్రంలోనికి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను సెల్ ఫోన్ లను, చేతి గడియారాలను, క్యాలిక్యులేటర్లను అనుమతించడం జరగదని అభ్యర్థులు గమనించి ముందు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 25 కేంద్రాల నందు 8,722 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యాలా అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. ఏర్పాటు చేసిన 5 రూట్లలో సీఐ స్థాయి అధికారి ఇన్చార్జిగా ఉంటూ, ఎస్ఐ స్థాయి అధికారి ద్వారా నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద డిఎఫ్ఎండి, హెచ్ హెచ్ ఎం డి లు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించడం జరుగుతుందని తెలిపారు. మహిళ అభ్యర్థులకు ప్రత్యేకంగా మహిళా సిబ్బంది ద్వారా తనిఖీ చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కేంద్రంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యల తలెత్తకుండా ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది ద్వారా బందోబస్తు చర్యలను చేపడుతున్నట్లు తెలియజేశారు. ఎలాంటి అత్యవసరం సమయంలోనైనా అభ్యర్థులు డయల్ -100 ద్వారా పోలీసు యంత్రాంగం సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. పరీక్షా పత్రాల జవాబు పత్రాల తరలింపులో ప్రత్యేక పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి పకడ్బందీగా నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.




నిరవధిక దీక్ష కొనసాగిస్తున్న సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు

# బతుకమ్మ ఆడుతూ తమ నిరసనను వ్యక్తం చేసిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 14(ప్రభాత ఉదయం)విద్యాశాఖ సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్ల సాధన కొరకు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారంతో ఐదవ రోజుకు చేరింది. నిరవధిక సమ్మెలో భాగంగా జిల్లా కేంద్రంలో దర్నా శిభిరం వద్ద ఉద్యోగులు తెలంగాణ బతుకమ్మ ఆడుతూ తమ నిరసనను వ్యక్తం చేశారు. తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ను ఉద్దేశిస్తూ అలాగే టి యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ తెలంగాణ మంత్రులు టీ ఏస్ టీ ముచ్చట్లు జరుపుతునట్టు ఒక సన్నివేశాన్ని ప్రదర్శించారు. అందులో భాగంగా సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయలనే ఉద్దేశం తో స్కిట్ ప్రదర్శించారు పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం సుభాన్ ఉద్యోగుల సమ్మెను ఉద్దేశించి మాట్లాడుతూ... మీ పోరాటానికి మా మద్దతు ఎప్పుడు ఉంటుందని పోరాడితేనే మన జోగులాంబ గద్వాల జిల్లా సాధించుకున్నామని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ఉండి కూడా సినీనటుడుఅల్లు అర్జున్ కు జరిగిన సన్నివేశానికి స్పందిస్తున్నారు కానీ తమ డిమాండ్ల కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు రోడ్డుపై చేస్తున్న విషయాన్ని పట్టించుకోవడం లేదన్నారు. ఎస్ టి యు టి ఎస్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ సమ్మెకు మద్దతుగా తెలిపారు. ఎస్ టి యు టి ఎస్ అధ్యక్షులు యూనస్ పాషా మాట్లాడుతూ... ఉద్యోగుల డిమాండ్లు న్యాయబద్ధమైనవే, గతం లో కూడా మేము మీ వెంట ఉన్నాము, ఇప్పుడు ఉంటాము, ఎప్పుడు ఉంటామని తెలియజేశారు. శాంతియుతంగా నిరసన తెలుపుతూ ప్రతిరోజు ప్రజాప్రతినిధులను కలిసి రీప్రజెంటేషన్ ఇవ్వాలని సలహా ఇచ్చారు. డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ... మీకు ప్రభుత్వం ఇస్తున్న జీతం ఒక వ్యక్తికి కూడా సరిపోదు అలాంటిది మీ కుటుంబం భారాన్ని మీరెలా నెట్టుకొస్తున్నారో తెలియట్లేదన్నారు. ఏ స్కేల్ సాధించడం కోసం మీరు చేస్తున్న ఈ దీక్ష సరైనదేనని మా మద్దతు మీకు ఎప్పుడు ఉంటుందని తెలిపారు.ప్రజా సంఘాల నాయకులు మోహన్ మాట్లాడుతు అప్పుడేనా ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమ్మెను ఉద్దేశించి మాట్లాడకపోవడం సిగ్గుచేటు, ఇంతమంది ఉద్యోగులు రోడ్లపై ఉంటే నీకు పట్టట్లేదు, సినీ యాక్టర్ల విషయంలో ఢిల్లీ నుండి స్పందించే నువ్వు, మేము పడ్తున్నా ఇబ్బందులు నీకు పట్టవా అనీ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, గట్టు , ఐజా, రాజోలి, ఇటిక్యాల, గద్వాల్ కేజీబీవీల స్పెషల్ ఆఫీసర్లు,సి .ఆర్. టి .లు . పీజీసీఆర్టీలు, కేజీబీవీ ల నుండి నాన్ టీచింగ్ స్టాఫ్ కూడా ఈ సమ్మెలో పాల్గొన్నారు.

# విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం




రెసిడెన్షియల్ హాస్టలను సందర్శించిన నాయకులు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న నాయకులు

## సిడీసీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి

కొత్తకోట, డిసెంబర్ 14(ప్రభాత ఉదయం) విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని సిడిసి చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం రాష్ట్ర సీఎం ఏ రేవంత్ రెడ్డి ఆదేశాలతో కొత్తకోటలోని గురుకుల సంక్షేమ హాస్టలను సిడీసీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, మండల తాసిల్దార్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ భాను కుమార్, స్థానిక నాయకులతో కలిసి రెండు గంటల పాటు వివిధ హాస్టల్ లను సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి సమావేశంలో పాల్గొని కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం గురుకుల హాస్టల్ విద్యార్థులకు 40 శాతం డేట్ చార్జీలను పెంచిందన్నారు. అదేవిధంగా 16 సంవత్సరాల తర్వాత ప్రభుత్వం కాస్మటిక్ చార్జీలను రెండు వందల శాతం పెంచిందన్నారు.గురుకుల విద్యార్థులకు పౌష్టిక ఆహారాన్ని అందిస్తూ ఇతర మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ ఆరోగ్య జాగ్రత్తలపై విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆహ్వాన అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని. మానసిక ప్రశాంతత అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. టి జి ఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ గురుకుల పాఠశాలకు స్వచ్ఛమైన తాగునీటి కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు 50 వేల రూపాయలు ప్రిన్సిపాల్ కి విరాళం అందించారు. చదువు ఒక్కటే అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతుందన్నారు.సమాజంలో అసమానతలు పేదరికం నిర్మలించడం దేశ అభివృద్ధి విద్యతోనే సాధ్యమన్నారు. విద్యార్థులు జాతీయ నాయకులను ఆదర్శంగా తీసుకొని వారి అడుగుజాడల్లో నడవాలని వారు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని పై స్థాయి చదువులకు విద్యార్థులు వెళ్లాలని నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో వేముల శ్రీనివాస్ రెడ్డి, ఎన్ జే బోయెజ్, పి కృష్ణారెడ్డి, ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, మేస్త్రి శ్రీనివాసులు, చర్లపల్లి శేఖర్ రెడ్డి, జె ఎం మిషేక్, పి మోహన్ రెడ్డి, జెసిపి రాములు, శివరాములు యాదవ్, కదిరి సాయిల్ యాదవ్, నరేందర్ సాగర్, జే సుభాష్, పి రవీందర్ రెడ్డి, పెంటన్న యాదవ్ వనపర్తి కృష్ణారెడ్డి,యాదయ్య సాగర్, గోకరయ్య నాయుడు,ఎండి ముస్తఫా, రాములు యాదవ్, సాయికుమార్, తయాబ్, ముజీబ్, బాబా, ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు, తదితరలు పాల్గొన్నారు.

# మెనూ ప్రకారం భోజనం అందించాలి



హాస్టల్లో రిజిస్టర్ పరిశీలిస్తున్న తహసిల్దార్ మల్లికార్జున్



వంట వస్తువులను పరిశీలిస్తున్న తహసిల్దార్ మల్లికార్జున్

## గద్వాల మండలం తాసిల్దార్ మల్లికార్జున్

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 14(ప్రభాత ఉదయం)విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, శుభ్రతతో కూడిన భోజనం అందించాలని గద్వాల తహసీల్దార్ మల్లికార్జున్ అధికారులకు సూచించారు. శనివారం గద్వాల్ తహసీల్దార్ మల్లికార్జున్ గద్వాలలోని షెడ్యూల్ కులాల బాలికల హాస్టల్ లో మెనూ లాంచింగ్ చేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మల్లికార్జున్ వసతిగృహంలో ఆహార పదార్థాల నాణ్యత, వాటి గడువు తేదీ పరిశీలించ డంతో పాటు స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆ హార పదార్థాలు వచ్చినప్పుడు అవి ఎన్ని వచ్చా యి, వాటి నాణ్యత ఎలా ఉంది అనేది విద్యార్థుల కమిటీ ద్వారా పరిశీలన జరిపి రిజిస్టర్‌లో వారి సంతకం తీసుకోవాలని సూచించారు. విద్యా ర్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పె ట్టాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు ఏమైనా ఉన్నాయా, మెనూ ప్రకారం భోజనం పె డుతున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం హాస్టల్ లో ఉన్న సమస్యలను హాస్టల్ వార్డెన్ ను అడిగి తెలుసుకున్నారు. 275 మంది బాలికలకు గానూ 9 మరుగు దొడ్లు ,9 బాత్ రూమ్స్ మాత్రమే ఉన్నాయని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. గద్వాల మునిసిపాలిటీ వాటర్ కనెక్షన్ ఉండి వాటర్ రావట్లేదని, మిషన్ భగీరథ వాటర్ కనెక్షన్ అసలు ఇవ్వనే లేదని, డైనింగ్ హాల్ లేదని, పిల్లలు చదువుకొనుటకు స్టడీ రూమ్ కూడా లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తహసిల్దార్ అక్కడ పిల్లలు క్రింద కూర్చొని అన్నం తింటూ వుంటే తహసిల్దార్ చలించి పోయారు. హాస్టల్ లో ఉన్న సమస్యల పై అధికారుల దృష్టికి తీసుకపోయి సమస్యల పరిష్కరానికి కృషి చేస్తామన్నారు.



హ్యాండ్బుకును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సంతోష్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ సంతోష్

# విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోంది: జిల్లా కలెక్టర్ సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 14(ప్రభాత ఉదయం) విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధి కోసం పౌష్టికాహార ప్రణాళి కను అమలు చేస్తూ, వారికి మంచి ఆరోగ్యం, భవిష్యత్తును అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సమీకృత బాలుర వసతి గృహంలో ఏర్పాటు చేసిన యూనిఫామ్ డైట్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్, జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు ముఖ్య అతిథులుగా పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి, ఎస్ఓపీ హ్యాండ్ బుక్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ...రాష్ట్ర వ్యాప్తంగా ఏకరీతి ఆహార ప్రణాళిక ద్వారా విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారాన్ని అందిస్తూ, వారి ఆరోగ్యం కోసం ప్రతి విద్యార్థికి నెల డైట్ ఖర్చును 1100 రూపాయల నుంచి 1540 రూపాయలకు పెంచినట్లు తెలిపారు. ప్రభుత్వం ఈ కార్యక్రమం ద్వారా వెనకబడి ఉన్న వర్గాలకు పౌష్టికాహారం అందించి, వారు మంచి విద్యను అభ్యసించి తమ భవిష్యత్తును మెరుగుపర్చుకుంటారని అన్నారు. విద్యార్థులు డాక్టర్, ఐఏఎస్, ఐపీఎస్ కావాలంటే ప్రతి రోజూ పాఠశాలకు హాజరై, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ వంద శాతం అటెండెన్స్‌తో కష్టపడి చదువుకోవాలని అన్నారు. ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలలతో సమానంగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని సదుపాయాలను కల్పించడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు, ఇటీవలే 12.60 లక్షల వ్యయంతో మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించడం జరిగిందన్నారు. విద్యార్థులు పదవ తరగతి పరీక్షలలో 10/10 జీపీఏ సాధించేందుకు కష్టపడి ఇష్టంగా చదవాలని అన్నారు. సాయంత్రం 10వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుందని, తల్లిదండ్రులు చదువు ఎంత ముఖ్యం అనే విషయాన్ని గుర్తించి, తమ పిల్లలను పాఠశాలలకు పంపించి, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు మంచి భోజన సదుపాయాలు అందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఎనిమిది సంవత్సరాల తర్వాత విద్యార్థి డైట్ చార్జీలను 40 శాతం పెంచినట్లు తెలిపారు. అదేవిధంగా, కాస్మోటిక్ చార్జీలను 200 శాతం పెంచినట్లు తెలిపారు. విద్యార్థులుబలంగా ఉండాలంటే మంచి పౌష్టికాహారం అవసరమని అన్నారు. విత్తనం కష్టాలను ఎదుర్కొని బలంగా చెట్టు ఎదిగినట్లుగా, మీరు కూడా కష్టాలను తట్టుకుని గొప్ప స్థాయికి ఎదగాలని అన్నారు. మంచి పౌష్టిక ఆహారం, ఆరోగ్యం బాగుండాలని ఉద్దేశంతో ప్రభుత్వం మార్నింగ్ బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. చిన్న వయసులోనే మంచి ఆహారం తీసుకుంటూ భవిష్యత్తులో గొప్ప స్థాయిలలోకి చేరి, మంచి ఆఫీసర్లుగా ఎదగాలని విద్యార్థులకు అయన సూచించారు. విద్యార్థులు శ్రద్ధతో చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. అనంతరం కలెక్టర్,ఎస్పీ విద్యార్థులు,తల్లిదండ్రులతో కలిసి స్పెషల్ మెనూలోని చికెన్ భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఏడి మైన్స్ బి.వి రమణ, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రమేష్ బాబు, ఏస్సి సంక్షేమ శాఖ అధికారి సరోజా, వార్డెన్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# తాను - నేను

కాలం రాసిన చందమామ కథ లాగా ఉండే తాను,
ఆ కథలకి కథకుడిగా మారిన నేను.

శాస్త్రి గారి సాహిత్యం లాగా ఉండే తాను,
ఆ సాహిత్యాన్ని కంఠస్థం పట్టిన నేను.

పొడుపు కథలని ముడి విడుపుగా విప్పే తాను,
మాటలతో ముడి వేసే వికటకవిని నేను.

జాబిలమ్మలా చీకటిలో వెలిగే తాను,
సూర్యుడిలా చీకటిలో ఉన్నా, వెన్నెలని పుట్టించే నేను.

చూపులతో నన్ను కట్టిపడేసిన తాను,
కంటిరెప్పలా, ఆ కనుపాపని కాపాడే నేను.

ఒక్క సైగతో నన్ను శాసించే తాను,
రాజుని అయినా, బంటు లా పాటించే నేను.

చిరాకుతో చివాట్లు పడ్డ తాను,
మన అనుకొని మాట జారిన నేను.

నిశ్శబ్దంగా సర్దుకుపోయే తాను,
నిరీక్షణతో దూరం అయిన నేను.

కారణాలతో కాల్చే తాను,
కోపంతో కంచె కట్టిన నేను.

అంతరిక్షంలో కూడా ఇరుకుని అనుభవించిన తాను,
గుండెలకి హత్తుకోవాలి అని ఎదురు చూస్తున్న నేను.

ఆలోచనలతో విడిపోయిన తాను,
జ్ఞాపకాలతో మిగిలిపోయిన నేను.

నింగిలా వేగాన్ని పుంజుకున్న తాను,
నేలలా నిలిచిన నేను.

హరివిల్లులా రంగులు పులుముకున్న తాను,
చీకటిలా నలుపుని పూసుకున్న నేను.

ఇంకెప్పటికీ కలవద్దు అన్న నిర్ణయంలో తాను,
ఎప్పుడెప్పుడు కలుద్దామనే ఆరాటంలో నేను.

ఎగిసే కెరటంలా తాను,
అందని తీరంలా నేను.

తాకే అంత చేరువలో తాను,
అందుకోలేనంత లోతులో నేను.

కను చూపూ మేరలో కూడా నన్ను చూడాలి అనుకోని తాను,
కౌగిలి లో నిక్షిప్తమై ప్రపంచానికి కనుమరుగు అవ్వాలి అనుకునే నేను.

దూరంతో దహించే తాను,
క్షమాపణ కోసం తపించే నేను.

నా నిరీక్షణని అలుసుగా తీసుకునే తాను,
నిరీక్షణ లో అలసిపోని నేను.

గుండెల్లో గుచ్చుకున్న బాణం తాను,
ప్రాణాలని సైతం విల్లుగా మార్చిన నేను.

మంచుని కప్పుకున్న పర్వతం లాంటి హృదయంతో తాను,
అందులో పొంగే ప్రతి నదిని గుండెల్లో పోగు వేసుకున్న నేను.

మీ
ఉప్పలా వివేక్

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.